క్లుప్తంగా

ఉత్సాహంగా ఉట్ల పరుష



ఉట్ల పరుష నిర్వహిస్తున్న దృశ్యం

కుందిర్పి: మండల పరిధిలోని వడ్డే పాలెంలో వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉట్ల పరుష నిర్వహించారు. యువకులు ఉట్లమాను ఎక్కేందుకు పోటీపడ్డారు. కుందిర్పి మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాల ప్రజలు జాతరకు తరలివచ్చారు.

ప్రతి హామీ అమలు చేసిన ఘనత జగనన్నదే



రాయదుర్గం: ఎన్నికల ప్రచారం చేస్తున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

రాయదుర్గం(డీ హీరేహాళ్): ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ యువనాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం డి హీరేహాళ్ మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే గా మెట్టు గోవిందరెడ్డి, ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ హెచ్ లక్ష్మీ, మండల కన్వీనర్ వన్నూర్‌స్వామి, మార్కెట్ యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, ఖాసీంపీరా, సర్పంచులు సుదర్శనరెడ్డి, మల్లికార్జున, నాగలాపురం అంజిరెడ్డి, తొండె వెంకటేశులు, సింగాడి జగదీష్, మంజు కార్యకర్తలు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే సహించేది లేదు

గుమ్మఘట్ట: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడి సృష్టించి, గొడవలు చేస్తే సహించే ప్రసక్తే లేదని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని గోనబావిలో మంగళవారం గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని, గొడవలు పెట్టుకొని ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎలాంటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాటర్ బాటిళ్ల ఫ్యాక్టరీ సీజ్



బాటిళ్ల తయారీ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో ఓ వాటర్ బాటిళ్ల తయారీ ఫ్యాక్టరీని మున్సిపల్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తుండడంతో కమిషనర్ కిశోర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ సిబ్బంది మంగళవారం ఫ్యాక్టరీని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో బంద్ చేయాలని యజమాని రాఘవేంద్రకు నోటీసులు జారీ చేశారు.

రక్తదానంపై అవగాహన అవసరం



రాగులపాడు గురుకుల పాఠశాలలో రక్త గ్రూపు పరీక్షలు చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: విద్యార్థులు రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని ప్రాణదాత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బి.తిప్పన్న తెలిపారు. మంగళవారం మండలంలోని రాగులపాడు బాలుర గిరిజన గురుకుల పాఠశాలలో గుంతకల్లు ప్రాణదాత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూపింగ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు బ్లడ్‌గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేసి, కార్డులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సంస్థ కార్యదర్శులు హనుమంతు, రాము, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎంసీసీ పర్యవేక్షణ అధికారిణి పర్యటన

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల, గడేహోతురు గ్రామాల్లో ఎంసీసీ పర్యవేక్షణ అధికారిణి విజయలలిత మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల నియమావళి, అమలు తీరు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో పక్కగా ఎన్నికల నియమావళి అమలు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియమావళిని ఎవరూ అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైద్యం..అత్యాధునికం

- 'దుర్గం' ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు
- సీహెచ్‌సీ నుంచి ఏరియా ఆస్పత్రిగా మార్పు
- ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు
- రూ.17 కోట్లతో శరవేగంగా నూతన భవన నిర్మాణ పనులు



పూర్తి కావొచ్చిన నూతన ఆస్పత్రి భవనాలు



కు.ని. చికిత్సల అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న మహిళలు

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ ఏర్పాటైన తర్వాత రాయదుర్గం ప్రభుత్వాస్పత్రి రూపురేఖలు మారిపోయాయి. రూ.కోట్లు వెచ్చించి, అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చారు. సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)గా ఉండే వైద్యశాలను వంద పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. రూ.17 కోట్లతో నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నిర్మాణం పూర్తయితే పేదలకు మెరుగైన సేవలు అందనున్నాయి.

రాయదుర్గం ఆస్పత్రిలో పేదలందరికీ ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారు. సిటీ స్కాన్‌లు, వివిధ రకాల రక్తపరీక్షలు, డయాలసిస్ సెంటర్, రక్త నిల్వ కేంద్రం, ఆరోగ్యశ్రీ, కు.ని. చికిత్సలు సిజేరియన్ లాంటి అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకొచ్చాయి. పైసా ఖర్చు లేకుండా రోగులకు ఖరీదైన వైద్యం అందుతున్నాయి. రాయదుర్గం సీహెచ్‌సీగా ఉన్న సమయంలో 200–250 ఓపీ ఉండేది. ప్రస్తుతం 500 నుంచి 800కు పెరిగింది. ఐపీ సేవలకు కూడా కూడా 40 నుంచి 50కి చేరింది.

అప్పట్లో ముగ్గురే వైద్యులు:

గతంలో ముగ్గురు వైద్యులతో సేవలు అందుతుండేవి. దీంతో పేదలు ప్రభుత్వాస్పత్రికి వెళ్లేవారు కాదు. సిబ్బంది కొరతతో బళ్లారి, అనంతపురానికి రెఫర్ చేయాల్సిన వచ్చేది. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత వైద్యసేవల్లో మార్పు వచ్చింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చాక వైద్య రంగానికి పెద్దపీట వేశారు. నాడు–నేడు పథకం ద్వారా ఆస్పత్రుల రూపురేఖలు మారాయి. ఆస్పత్రిలో ఎనిమిది మంది స్పెషలిస్టు వైద్యులు అందుబాటులోకొచ్చారు. అన్ని విభాగాల నుంచి 23 మంది రెగ్యులర్, 23 మంది కాంట్రాక్టు, 16 మంది ఔట్ సోర్సింగ్ పోస్టులు ఉండాలి. ఇందులో 62 మంది విధుల్లో చేరగా, 34 భర్తీ కావాల్సి ఉంది. పేదలకు వైద్య సేవలు సక్రమంగా అందిస్తున్నారు.

ఏరియా ఆస్పత్రికి మహర్దశ



రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి మహర్దశ కలిగింది. గతం కంటే భిన్నంగా మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. అత్యాధునిక పరికరాలు అందుబాటులోకొచ్చాయి. నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మూడు ఆపరేషన్ థియేటర్లు, రక్తనిల్వ కేంద్రం, ల్యాబ్ ఇతర సౌకర్యాలన్నీ వంద పడకలకు తగ్గట్టుగా సమకూర్చారు.

- ఎండీ మహ్మద్‌బాషు, ఆస్పత్రి ఏఓ, రాయదుర్గం

పేదలకు నాణ్యమైన వైద్యం



పేదలందరికీ నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చాం. మహిళ, పురుష వైద్యుల్లో ఎక్కువ శాతం స్పెషలిస్టులు ఉన్నారు. ఖరీదైన వైద్య సేవలు అందుతున్నాయి. ఓపీ సేవలు రెట్టింపయ్యాయి. మహిళలు, గర్భిణులు ఎక్కువ శాతం ఆస్పత్రికి వస్తున్నారు. మాతాశిశు మరణాల రేటు తగ్గించేందుకు కృషి చేస్తున్నాం.

- మాధవి, మెడికల్ సూపరింటెండెంట్, రాయదుర్గం

గెలిపించండి..సేవకుడిగా పనిచేస్తా

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి



16వ వార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గంటౌన్: నేను స్థానికుడిని..మీవాడిని.. జగనన్న ఆశయం, ఆకాంక్షలకనుగుణంగా మీ సేవకుడిగా పనిచేస్తా.. మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని మెట్టు గోవిందరెడ్డి అభ్యర్థించారు. మంగళవారం పట్టణంలోని 16వ వార్డులో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, వార్డు కౌన్సిలర్ మల్లెపూల మమత, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోమారు వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలీబాష, వైఎస్సార్ సీపీ నాయకుడు పారాళ్ల శివకుమార్, కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, షబ్బీర్, డిష్ గోవిందు, పైతోట సంజీవప్ప, ఐనాపురం మంజునాథ, కోఆప్షన్ సభ్యుడు నజీర్, మాజీ కౌన్సిలర్ రఘురాం, వార్డు ఇన్‌చార్జులు గంగాధర్ యాదవ్, గోల్డ్ ఇస్మాయిల్, గోనబావి నిజాముద్దీన్, భీమనపల్లి దివాకర్, బషీర్ అహ్మద్, పైతోట రఘు, తిమ్మరాజు, కొలిమి ఆనంద్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి రంగయ్య

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గరీబ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య సమక్షంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పార్టీ కండువాలు వేసి, ఆహ్వానించారు. బంగ్లా ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రశాంత్‌కుమార్, రియాజ్, ఆదిలక్ష్మి, అజయ్, ప్రవీణ్‌కుమార్, షాహుద్దీన్, హరి, సాయి, వంశీ, భాస్కర్, రాజేష్, బీఎల్ ఎర్రిస్వామి, మాధవి,షఫీ, ఆశమ్మ, రిజ్వానా, సరోజ, వీరస్వామి, అనూష ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక : పట్టణంలోని దేవీరమ్మ కాలనీలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రూతమ్మ ఆధ్వర్యంలో బోయ చంద్రశేఖర్, బోయ అలివేలమ్మ కుటుంబాలు కాంగ్రెస్‌ను వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య సమక్షంలో వీరికి కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు.

సంక్షిప్త సమాచారం

రెండో రోజూ 'పది' పరీక్షలు ప్రశాంతం

గుమ్మఘట్ట: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలో నిర్వహించిన పదో తరగతి పరీక్షకు 683 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ నాగమణి-1, ఎంఈఓ రామచంద్ర-2 తెలిపారు. 80 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారన్నారు.

29 మంది విద్యార్థుల గైర్హాజర్

కూడేరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా రెండో రోజు మంగళవారం హిందీ పరీక్ష జరిగింది. 29 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. కూడేరు హైస్కూల్ కేంద్రంలో 241 మందికి గాను 225 మంది, కేజీబీవీ కేంద్రంలో 114కి గాను 101 మంది హాజరయ్యారన్నారు. తహసీల్దార్ రత్నరాధిక పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో చీఫ్ అధికారులు దిలీప్, తిమ్మప్ప, డిపార్టమెంటల్ అధికారులు నరహరి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే అభ్యర్థి రంగయ్య పర్యటన

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు కుమ్మరవీధిలో బుధవారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య పర్యటించనున్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

కంబదూరు: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తీసుకొచ్చి గుట్టుగా విక్రయిస్తున్న మురళీ అనే వ్యక్తిని కంబదూరు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ ఆంజనేయులు దాడులు చేసి, 62 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

మారెమ్మ ఆలయంలో చోరీకి యత్నం

బ్రహ్మసముద్రం: నాగిరెడ్డిపల్లి సమీపంలోని మారెమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఆలయంలోకి ప్రవేశించి, సీసీ కెమెరాలను పగులగొట్టి, హుండీ ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. పొలాల వద్దకు వెళ్తున్న రైతులు కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు.

నాణ్యతలో రాజీపడొద్దు

కూడేరు: మండలంలోని పి.నారాయణపురం దళితవాడకు రూ.70 లక్షలతో సిమెంట్ నిర్మాణానికి ఇటీవల ఎమ్మెల్యేఅభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకర నారాయణ భూమి పూజ చేశారు. మంగళవారం ఎంపీపీ నారామణ రెడ్డి నిర్మాణపు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయులు, అక్కులన్న, గురునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు, హులికల్లు ఫారెస్ట్‌లో రెండు పేకాట స్థావరాలపై దాడులు చేసినట్లు సీఐ హరినాథ్ మంగళవారం తెలిపారు. మొత్తం 16 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.73 వేల నగదు, 11 బైక్‌లను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బొమ్మనహాళ్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రామాంజినమ్మ హెచ్చరించారు. బుధవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో చౌక దుకాణ డీలర్లు, ఎండీయూ వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుజాత, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్‌ఓలు నరసింహమూర్తి, శృతి, యుగేంధర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: గరుడాపురం గ్రామం సమీపంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చిత్తయ్య గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కంబదూరు మండలం కదిరిదేవరపల్లికి చెందిన చిత్తయ్య ఆటోలో మంగళవారం కళ్యాణదుర్గం వచ్చి, తిరిగి వెళ్తుండగా గరుడాపురం వద్ద ఆటో బోల్తా పడింది. చిత్తయ్యను స్థానికులు సీహెచ్‌సీకి తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: గరుడాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే యువకుడు మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఆంజనేయులు మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండేవాడు. తాగిన మైకంలో మంగళవారం పెట్రోల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.

ప్రతి పౌరుడికీ ఓటు వజ్రాయుధం

- కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణీసుస్మిత



ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ రాణీసుస్మిత

కళ్యాణదుర్గం: ప్రతి పౌరుడికీ ఓటు వజ్రాయుధమని కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణీసుస్మిత అన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ ఉద్యోగులతో కలిసి ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీ చేశారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, వినియోగం వంటి వాటిపై బైకు ర్యాలీ, ప్లకార్డులతో ఉద్యోగులు ర్యాలీ చేశారు. అంబేడ్కర్ సర్కిల్, టీ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ వెంకటేశులు, సహాయకులు శ్రీనివాసులు, ఐదు మండలాల తహసీల్దార్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

కంబదూరు: ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన బార్డర్ చెక్ పోస్టులలో విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ రాణీసుస్మిత ఆదేశించారు. మంగళవారం కంబదూరు బార్డర్ చెక్‌పోస్టును ఆర్డీఓ తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ బార్డర్ చెక్పోస్టులలో విధులు నిర్వర్తించే సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకుండా నిఘా పటిష్ట చేయాలన్నారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సలహాలు,సూచనలు ఇచ్చారు.

మేలు చేసిన వారిని ఆదరించండి

- ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య



మారెంపల్లిలో ప్రచారం చేస్తున్న తలారి రంగయ్య



దేవీరమ్మ కాలనీలో ప్రచారం చేస్తున్న తలారి రంగయ్య, జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

కళ్యాణదుర్గం: ప్రజలకు మేలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య కోరారు. మంగళవారం పట్టణంలోని మారెంపల్లి, దేవీరమ్మ కాలనీలలో ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించారు. టీడీపీ ప్రభుత్వానికి జగనన్న ప్రభుత్వానికి మధ్య తేడా గుర్తించాలన్నారు. రాబోవు ఎన్నికలకు మరోసారి ప్రజలను వంచించడానికి టీడీపీ, జనసేన, బీజేపీలు మూకుమ్మడిగా వస్తాయన్నారు. అనంతరం చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు, కిరణా తదితర దుకాణాల వద్ద ఓట్లను అభ్యర్థించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయం ఫణి, కౌన్సిలర్లు లక్ష్మన్న, అర్చన, పరమేశ్వరప్ప, కోఆప్షన్ సభ్యులు సురేష్, ఆఫ్జల్, సీనియర్ నాయకులు దొణస్వామి, తిరుమల వెంకటేశులు, సుధీర్, నరేంద్రరెడ్డి, గోళ్ల సూరి, రేవన్న గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, బిక్కిహరి, పరంధామరెడ్డి, మల్లికార్జున, ఉమేష్, నల్లప్ప, హరి, పాండు, రాము, మల్లి, రామిరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

= కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దేవీరమ్మ కాలనీలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్యకు మద్దతుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొని, ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొమ్మన్న, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్షావలి, కౌన్సిలర్ పరమేశ్వరప్ప, శ్రీకాంత్, వాణిజ్య విభాగం కార్యదర్శి గుప్తా, రామిరెడ్డి, రాములు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో ముసలం

- నేతల మధ్య సెగలు కక్కుతున్న అసంతృప్తి జ్వాల
- రాయదుర్గంలో కాలవపై పెరుగుతున్న వ్యతిరేకత
- కళ్యాణదుర్గంలో అమిలినేనికి ఉన్నం, ఉమా సెగ
- ఉరవకొండలోనూ గట్టెక్కడం కష్టమే..!

రాయదుర్గం: తెలుగుదేశం పార్టీలో ముసలం పట్టుకుంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఆ పార్టీ నేతల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుతున్నాయి. పైకి అందరూ బాగున్నట్టు కనిపిస్తున్నా.. లోలోపల నిప్పులు కక్కే పరిస్థితి. ఎన్నికల్లో పార్టీ గట్టెక్కడం కష్టమేనంటూ శ్రేణుల్లోనూ ఆందోళన కనిపిస్తోంది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులుపై రాయదుర్గంలో అసంతృప్తి ఓ రేంజీలో పేరుకుపోయింది. పార్టీలో అంతా తానై వ్యవహరిస్తుండడంతోనే సీనియర్లు కూడా అంటీముట్టనట్లు ఉన్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికారంలో ఉన్నప్పుడు ముఖ్య పదవులు అనుభవించిన వారు కూడా పార్టీ కోసం పనిచేయడం లేదని ఆపార్టీ నేతల్లోనే చర్చ సాగుతోంది.

మొన్నటి దాకా రాయదుర్గం అసెంబ్లీ టికెట్ మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డికే ఇస్తారనే ప్రచారం ఆ వర్గాల్లో విస్తృతంగా సాగింది. దీనికితోడు దీపక్‌రెడ్డి ఇటీవల మాజీ జెడ్పీ చైర్మన్ పూల నాగరాజుతో కలిసి చంద్రబాబుతో భేటీ అయిన ఫొటోలు అప్పట్లో నెట్టింట్లో వైరల్ అయ్యాయి. టిక్కెట్టు విషయంలో చంద్రబాబు వారికి మొండిచేయి చూపారు. కాలవకే పార్టీ పగ్గాలు అప్పజెప్పారు. దీంతో దీపక్, పూల వర్గాలు కాలవతో కలిసి నడవలేదు. ఎదురుపడ్డప్పుడు మాత్రమే కడుపులో కత్తుపెట్టుకొని కౌగిలించుకుంటున్నారు. యూత్ నాయకులు కూడా దూరమైపోయారు.


కళ్యాణదుర్గంలో వర్గ విభేదాలు..

కళ్యాణదుర్గం టీడీపీలోనూ వర్గవిభేదాలు రాజుకుంటున్నాయి. పార్టీకి మూలస్తంభంగా చెప్పుకునే మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి, ఉమామహేశ్వర్ నాయుడులను కాదని అనంతపురం నాన్‌లోకల్ అయిన కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబుకు టీడీపీ టికెట్టు కట్టబెట్టారు. దీంతో ఉన్నం, ఉమాలతో పాటు వారి వర్గాలు భగ్గుమన్నాయి. పార్టీని నమ్ముకున్నందుకు మంచి గుణపాఠం చెప్పారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

పయ్యావులకు పరాభవమేనా..?

ఉరవకొండలోనూ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ఈ సారి పరాభవం తప్పదని ప్రజలు భావిస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక విజయవాడ, హైదరాబాద్ నగరాలకే పరిమితమయ్యాడు తప్పా, ఓట్లేసి గెలిపించిన ప్రజల బాగోగులు పట్టించుకున్న పాపానపోలేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాల దృష్ట్యా టీడీపీ గట్టెక్కడం అంత సులభం కాదని విశ్లేషకులు, పలువురు నాయకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా విజయం కోసం అన్ని పార్టీల్లోనూ పోరు మొదలైంది.

ఇళ్ల పట్టాలిస్తే తప్పుడు పత్రాలంటారా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బెళుగుప్ప: ఎస్సీలకు ఎన్నో ఏళ్ల తర్వాత ఇళ్ల పట్టాలు ఇస్తే.. జీర్ణించుకోలేక టీడీపీ మండల నాయకులు అవి తప్పుడు పత్రాలు అని విమర్శలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ నయాకులు ధ్వజమెత్తారు.మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలను ఎంపీపీ పెద్దన్న, పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, సింగిల్ విండో అధ్యక్షుడు శివలింగప్ప, సర్పంచ్ రామిరెడ్డి ఖండించారు. దుద్దేకుంట గ్రామంలోని ఎస్సీలకు ఎన్నో ఏళ్ల తర్వాత పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి చొరవతో 201 సర్వేనంబర్‌లో 150 మంది ఎస్సీలకు ఇళ్ల పట్టాలు కేటాయిస్తే.. ఇచ్చిన పట్టాల్లో హద్దులు లేవని, అవి తప్పుడు పత్రాలు అని టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎస్సీలకు పట్టాలను లాటరీ పద్ధతిలో ఇవ్వాలన్న ఉద్దేశంతో హద్దులు ప్రదేశంలో ఖాళీ పెట్టడం జరిగిందన్నారు. 2019లో పయ్యావుల కేశవ్ ఎస్సీలకు ఇచ్చిన పట్టాలలో సర్వేనంబర్లు, హద్దులు కూడా లేవని, స్థలాలు కూడా చూపించలేదన్నారు. కేశవ్ ఎంత మోసగాడో బెళుగుప్ప ప్రజలకు బాగా తెలుసనని, కేవలం ఓట్ల కోసం ప్రజలను మోసం చేస్తాడని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తంరాజు, పాతన్న, రాజగోపాల్, తిమ్మారెడ్డి, కరుణాకర్, గురుమూర్తి, తిప్పేస్వామి, నరిగన్న, శ్రీనివాసనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు తనిఖీ చేసిన సీఐ



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

బ్రహ్మసముద్రం : మండలంలోని ఎరడికెర చెక్ పోస్టును కళ్యాణదుర్గం రూరల్ సీఐ నాగరాజు మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ చెక్ పోస్టు ద్వారా వెళ్లే ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పాలవెంకటాపురంలో గ్రామస్తులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. గ్రామాల్లో ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పరుశురాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లి శివారులో ఏర్పాటు చేసిన పోలీసు చెక్ పోస్టును మంగళవారం తహసీల్దార్ హనుమంతు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చెక్ పోస్టులోని రికార్డులను పరిశీలించారు. సారా, మద్యం, గంజాయి, నగదు అక్రమంగా రవాణా కాకుండా క్రమం తప్పకుండా వాహనాల తనిఖీ చేయాలని చెక్ పోస్టు సిబ్బంది, పోలీసులను ఆదేశించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొమ్మనహాళ్: బళ్లారి– కళ్యాణదుర్గం రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గురు మూర్తి (40) బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. కణేకల్లు మండలం అంబాపురానికి చెందిన గురుమూర్తి, బీహార్‌కు చెందిన ఉదయ్ ద్విచక్రవాహనంపై వెళ్తూ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఉదయ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందగా, గురుమూర్తి మంగళవారం మృతి చెందాడు. మృతుడు గురు మూర్తికి భార్య శశికల ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహనాల తనిఖీ

వజ్రకరూరు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌వద్ద మంగళవారం ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఉరవకొండ–గుంతకల్లు ప్రధాన రహదారిలో వాహనాలను తనిఖీ చేశారు.